ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 29-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- రాష్ట్ర హైకోర్టులు తీర్పులను రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా వెలువరించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

- ఈ ఏడాది వర్షాకాలంలో దేశంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

- ఐపీఎల్ లో భాగంగా చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ వేదికగా గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య రెండో క్వాలిఫయర్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = =

మయన్మార్ అధ్యక్షుడు మిన్ ఆంగ్ హ్లాయింగ్ రేపటి నుంచి జూన్ 3వ తేదీ వరకు భారత్ లో పర్యటిస్తారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై యూ మిన్ ఆంగ్ చర్చిస్తారని తెలిపారు. భారత్-చైనా సరిహద్దు వ్యవహారాలపై ఇటీవల జరిగిన వర్కింగ్ మెకానిజం సమావేశంపై జైస్వాల్ మాట్లాడుతూ, చర్చలు నిర్మాణాత్మకంగా, భవిష్యత్ దృష్టితో సాగాయని అన్నారు. సరిహద్దుల నిర్ధారణ, నిర్వహణ, యంత్రాంగ నిర్మాణం, సరిహద్దు సహకారానికి సంబంధించిన అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయని ఆయన తెలిపారు. సరిహద్దు నదులపై తదుపరి నిపుణుల స్థాయి యంత్రాంగ సమావేశాన్ని కూడా త్వరితగతిన నిర్వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని రణధీర్ జైస్వాల్ తెలియజేస్తూ...

(వాయిస్…25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర హైకోర్టులు తీర్పులను రిజర్వ్ చేసిన మూడు నెలల్లోగా వాటిని వెలువరించాలని సుప్రీంకోర్టు ఈరోజు ఆదేశించింది. తీర్పులు వెలువరించడంలో ఆలస్యం అనేది వ్యాజ్యదారులకు పూడ్చలేని నష్టాన్ని కలిగిస్తుందని పేర్కొంది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన కేసులలో వేగవంతమైన నిర్ణయాలు అవసరమని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాఘ్చీలతో కూడిన ధర్మాసనం.. బెయిల్ దరఖాస్తులపై ఉత్తర్వులను అదే రోజు వెలువరించాలని, ఒకవేళ వాటిని రిజర్వ్ చేస్తే మరుసటి రోజు వెలువరించి, అప్‌లోడ్ చేయాలని తెలిపింది. బెయిల్ లేదా శిక్ష నిలుపుదల ఉత్తర్వును వెలువరించిన వెంటనే జైలు అధికారులకు తెలియజేయాలని, విచారణలో ఉన్న దోషిని వీలైతే అదే రోజు లేదా మరుసటి రోజు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పలు అంశాలపై హైకోర్టులకు మార్గదర్శకాలను జారీ చేసింది.

= = = = = = = = = = = = = = = = = =

ఈ ఏడాది దేశంలో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ఈ సంవత్సరం రుతుపవనాల రాక, వర్షపాతానికి సంబంధించిన వివరాలను ఈరోజు న్యూఢిల్లీలో ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర పాత్రికేయులకు వివరిస్తూ.. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో ఈశాన్య భారతదేశంలో వర్షపాతం సాధారణంగా.. మధ్య, దక్షిణ ద్వీపకల్ప, వాయువ్య భారతదేశంలో సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఆయన తెలిపారు. జూన్ నెలలో దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే అధిక గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. జూన్ నెలలో ఉత్తర ప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్‌లోని అనేక ప్రాంతాలలో సాధారణం కంటే అధిక వడగాలుల పరిస్థితులు ఏర్పడతాయని ఆయన వివరిస్తూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక ఈ ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి నిల్వలు తగినంత ఉన్నాయని, అన్ని రిఫైనరీలు గరిష్ట స్థాయిలో పనిచేస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన అంతర్-మంత్రిత్వ శాఖ సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ మాట్లాడుతూ.. ఎల్‌పిజి ఉత్పత్తి రోజుకు సుమారు 92 వేల మెట్రిక్ టన్నులతో అత్యధిక స్థాయిలో ఉందని తెలిపారు. ఏ ఎల్‌పిజి పంపిణీ కేంద్రంలోనూ నిల్వల కొరత నమోదు కాలేదని ఆమె పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

ఈ సమావేశంలో ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ ఒపేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ, నావికుల సంక్షేమం, నిరంతరాయ సముద్ర కార్యకలాపాలను నిర్ధారించడానికి తమ మంత్రిత్వ శాఖ.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత మిషన్లు, సముద్ర రంగ భాగస్వాములతో సమన్వయం కొనసాగిస్తోందని తెలిపారు. నిస్సోస్ కెరోస్ అనే ముడి చమురు ట్యాంకర్ వాణిజ్య నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటిందని, అది జూన్ 3వ తేదీన విశాఖపట్నం చేరుకుంటుందని ఆయన తెలియజేశారు. ఈ నౌక సుమారు 2 లక్షల 70 వేల మెట్రిక్ టన్నుల ముడి చమురును తీసుకువెళుతోందని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హులైన విద్యార్థులకు రక్షణ కల్పిస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హామీ ఇచ్చారు. ఈరోజు డీడీ న్యూస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా పునఃపరీక్షల ప్రక్రియను సరైన, క్రమపద్ధతిలో నిర్వహిస్తామని చెప్పారు. దీనిని సజావుగా నిర్వహించడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు పరీక్ష రద్దు చేశారని.. నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, పరీక్షల వ్యవస్థలో నిష్పక్షపాతాన్ని కాపాడటానికే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పరీక్షా ప్రక్రియపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ లో భాగంగా న్యూ చండీగఢ్ లోని ముల్లాన్ పూర్ వేదికగా క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన రాజస్థాన్ జట్టు బ్యాటింగ్ ప్రారంభించి, 9 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్లు నష్టపోయి 100 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు ఫైనల్ కు చేరుతుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్లు సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1,092.05 పాయింట్ల నష్టంతో 74,775 వద్ద, నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547 వద్ద నిలిచాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 95.05గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4530 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్.. 2047 నాటికి అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా మారేందుకు క్షేత్రస్థాయిలో వ్యక్తులను శక్తివంతం చేయడం ఎంతో అవసరమని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్.పి. సింగ్ బఘేల్ అన్నారు. ఈరోజు గౌహతిలోని పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'సేవా సే సమృద్ధి' పేరుతో పంచాయతీల ద్వారా మెరుగైన సేవలు అందించడంపై ప్రాంతీయ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ.. రాష్ట్రానికీ, దేశానికీ సాధికారత కల్పించాలంటే గ్రామ స్థాయిలో పౌరులకు సాధికారత కల్పించడం అవసరమని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =